# జీవితరంగం

## – స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

రాత్రి భోజనాలయ్యాక యధావిధిగా వెన్నెల్లో మంచాలూ పక్కలూ వేసుకున్నాక అమ్మమ్మ వచ్చింది మంచినీళ్ళ చెంబుతోటి. అందరం చుట్టూ చేరిపోయాం. కాసేపు పాటలూ కబుర్లూ అయ్యాక, నా సందేహాల మూట విప్పాను. “మళ్ళీ గుంటూరు వెళ్ళాక ఏంచేసారో చెప్పవా” అని. “ఈ సారి పోరాటం బాగా ఉధృతం గా సాగింది. సత్రం లో అనేక కార్యక్రమాలు ఎప్పుడూ జరుగుతుండేవి.”

"గుంటూరులో ఈ సహాయ నిరాకరణ ఉద్యమం ఇంత ఉధృతం గా సాగటానికి ముఖ్య కారణం అయిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులుగారు. ఆయన మాకు చుట్టమే. అన్నయ్య వరస అవుతారు. ఆయన ఈ పనుల మీద తరచుగా గుంటూరు వస్తూ ఉండేవారు. వారి బస దాదాపుగా దేచిరాజు వారింటే ఉండేది. ఆయన భోజన ప్రియుడు. రోట్లో రుబ్బిన కంది పచ్చడి చాలా ఇష్టంగా తినేవాడు. అరిటాకులో ఇబ్బంది పడకుండా చారు అన్నం తినటం కోసం ఆయనకు ఒక మట్టు ఉన్న వెండిగిన్నె లో చారు అన్నం వడ్డించేవాళ్ళం. అది ఇప్పటికీ గుంటూరులో ప్రకాశం పంతులు గారి చారు గిన్నెగానే పిలుస్తాం."

"ఇంక నిత్యానందయ్యా ఇంకొంతమంది మగవాళ్ళూ చుట్టుపక్కల ఊళ్ళు తిరిగి ధాన్యం లాంటివి సేకరించేవాళ్ళు ఉద్యమం కోసం. సభలూ సమావేశాలు జరగాలంటే ఆ ఏర్పాట్లకోసం తిరిగే వాళ్ళకు సత్రం లోనే వంటలు చేసేవాళ్ళం. ఇళ్ళలోపనులు అయ్యాక రోజూ కొంతమందిమి బృందాలుగా తయారై అక్కడి వంట పనులు చూసుకునే వాళ్ళం."

"ఎవరు వచ్చినా సరే పొద్దుగూకే వరకూ విస్తళ్ళు వేసి వడ్డనలు జరుగుతూఉండేవి. వడ్డించడానికి చిన్నపిల్లలూ, అత్తగార్లతో పాటుగా వచ్చే కోడళ్ళూ ఆసక్తి చూపించేవారు. కొంతమంది కూరగాయలు కూడా పంపించేవారు. చుట్టు పక్కల పల్లెటూళ్ళనుండి గుంటూరులో పాలూ పెరుగులు అమ్ముకునే వారు కూడా తమ వంతుగా సత్రంవైపుకి వచ్చి, వాళ్ళ దగ్గర ఉన్నదేదో పాలో, పెరుగో ,దొడ్లో కాసిన సొరకాయల్లాంటి కూరగాయలో ఇచ్చివెళ్ళే వాళ్ళు."

"అయితే ప్రజలందరూ చాలా ఉత్సాహంగా పాల్గొనేవాళ్ళన్నమాట" అన్నాను నేను. "అన్నిరకాలవాళ్ళూ ఉండేవాళ్ళు. ఉత్సాహంగా పాలుపంచుకునేవాళ్ళు కొందరైతే, కొందరు ఇదంతా వృధా ప్రయత్నమంటూ వెనక్కి లాగేవాళ్ళూ ఉండేవాళ్ళు. కొంతమంది ఎటూ కాకుండా మౌనం గా జరిగేవాటిని గమనిస్తూ, వార్తాపత్రికల్లో విషయాలు చదివి చర్చించుకుంటే, కొంతమంది ముఖ్యంగా ఆడవాళ్ళని ఏం పనా పాటా ఇళ్ళలో అదుపులేక తిరుగుతున్నారు అనేవాళ్ళు. ఎవరెన్ని అన్నా ధైర్యం గా మాపని మేము చేసుకుంటూపోయేవాళ్ళం. "

"నిత్యానందయ్య లాంటి వాళ్ళు అలా మాట్లాడిన వాళ్ళనే పట్టుదలగా వాదించి ఒప్పించి ఉద్యమం వైపుకు లాగేవాళ్ళు. అందులో నిత్యానందయ్య అందెవేసిన చెయ్యి. ఆయన పేరు మర్చిపోయాను గానీ వాళ్ళింటిపేరు రూపాకుల అయన ఇలాగే మాట్లాడేవాడు. ఆయనతో బాగా సావాసం చేసి ఉద్యమం లో వీళ్ళకంటే చురుగ్గా పాల్గొనేలా చేశాడు."

"ఒకసారి నిత్యానందయ్యా, ఆ రుపాకులాయనా ఇంకో పదిమందీ కలిసి గుంటూరులోని పోస్ట్ డబ్బాలో నిప్పు వేశారు. అది చాలా పెద్ద గొడవ జరిగింది. అది పోలీసులకు పెద్ద సవాలుగా మారింది వారం తరువాత వీళ్ళను అరెష్టు చేసి వారం పాటు గుంటూరు సబ్ జైల్లోనే ఉంచి తరువాత రాయవెల్లూరు జైలుకు తరలించారు. "

నాకు చాలా ఆనందం అనిపించింది. మేము బాగా చిన్నపిల్లలం గా ఉన్నప్పుడు మా నిత్యానందయ్య తాతయ్య మాయింట్లోనే ఉండేవాడు. ఇప్పుడాలోచిస్తే ఆయన ఆలోచనల్లో మాకంటే ఒకతరం ముందు ఉండేవాడు. చిన్నప్పుడు మా చదువు సంధ్యలన్నీ చాలా శ్రద్ధగా ఆయనే చూసుకునేవాడు.మమ్మల్ని ప్రతి సాయంత్రం పార్క్ కి తీసుకొనివెళ్ళి వార్తలు వచ్చేదాకా మేము ఆడుకుంటే, ఆ తరువాత పార్క్ లో మైకులో రేడియోలో వార్తలు పెట్టేవాళ్ళు ఆ వార్తలు విని ఇంటికివచ్చి స్నానాలు చేసి లాంతర్ల చుట్టూ కూర్చుని చదువుకునేవాళ్ళం.

మాకు స్కూల్లో చెప్పిన పాఠాలు వివరంగా మళ్ళీ ఒకసారి చెప్పేవాడు. మా హోంవర్కులు అడిగి తెలుసుకుని మాచేత చేయించేవాడు. గాంధీ, నెహ్రూ, వీరశివాజీ, సుభష్ చంద్రబోస్, వీర సావర్కార్ లాంటి వారి గురించీ మాకు వివరంగా కథల్లా చెప్పేవాడు. రష్యా, జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఆర్థిక రాజకీయ వ్యవస్థల గురించీ వాటి అభివృద్ధి గురించీ అక్కయ్యల తో మాట్లాడుతుంటే మేమూ పెద్ద తెలిసినట్లు ఉత్సాహం గా వినేవాళ్ళం.

మా సుప్రభ అక్కయ్య "నువ్వొక లివింగ్ ఎన్సైక్లోపీడియావి తాతయ్యా ఏ డౌట్ వచ్చినా ఇట్టే చెప్పేస్తావ్. ఇంతకీ ఏం చదువుకున్నావ్ నువ్వు" అనేది. "చదువు మధ్యలోనే ఆపేసి స్వాతంత్రోద్యమంలో దూకానా అమ్మడూ" అంటూ అపురూపంగా తన ట్రంకుపెట్టెలో దాచుకున్న 'తామ్ర పత్రాన్ని' తీసి చూపిస్తూ "స్వాతంత్ర సమరయోధుడిగా నన్ను గుర్తిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఈ తామ్రపత్రమే నేను సాధించిన గొప్పడిగ్రీ "అని గర్వంగా చెప్పేవాడు.

అప్పట్లో అతి వేగంగా పోయే గ్రాండ్ ట్రంక్ ఎక్స్ప్రెస్ ని మాకు చూపించాలని మమ్మల్నందరినీ రైల్వేస్టేషన్ కి తీసుకుని వెళ్ళాడు. మేమందరం ఉత్సాహంగా ప్లాట్ ఫాం మీదనుంచి పట్టాలమీదకు తొంగిచూస్తుంటే ...స్టేషన్ మాస్టర్ వచ్చి తాతయ్యను తిట్టాడు. "తాతగారూ ఆ రైలు చాలా వేగం గా వెళుతుంది. పిల్లలు ఆవేగానికి రైలు క్రిందకి పడిపోతారు జాగ్రత్త" అంటూ.

అప్పట్లో మేము వేటపాలెం లో ఉండేవాళ్ళం. తరువాత నరసరావు పేట వచ్చేశాం. ఆ చిన్నతనమొక లీలగా మెదిలే జ్ఞాపకం అంతే ...కానీ తరువాత అక్కయ్యలూ, అమ్మా, అమ్మమ్మా ఆవూరిలో అప్పటి కుటుంబ పరిస్థితుల గురించి మాట్లాడుకుంటుంటే నా కళ్ళు చెమ్మగిల్లేవి. అక్కడ మాకున్న, మా జీవనోపాధి అయిన ఆ పదెకరాల పొలం మా నిత్యానందయ్య తాతయ్యది.

స్వాతంత్రోద్యమం లో అమ్మమ్మ చెప్పే నిత్యానందయ్య ఆయనే! ఆయన పొలం మనమెందుకు వాడుకున్నాం? ఆయన మనింట్లో ఎందుకున్నాడూ ...నా సందేహాలన్నీ మావాళ్ళ మాటల్లోనే తెలిశాయి. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఆదర్శం గా విధవా వివాహం చేసుకోవాలని గుంటూరు దగ్గరి ఊరిలో ఒకమ్మాయిని చూసారనీ కానీ వాళ్ళ వాళ్ళు ఒప్పుకోక గొడవ జరిగి తాతయ్యను బాగా కొట్టారనీ తలకు గాయమై తగ్గటానికి చాలారోజులు పట్టిందనీ ఇంక వివాహమే చేసుకోలేదనీ తెలిసింది.

కొన్నేళ్ళ తరువాత ఆయన తమ్ముడి భార్య ఈయన తమకు భారంగా ఉన్నాడనీ చంపేస్తే పెళ్ళీ పెటాకులూ లేవుగనుక ఆయన పేరుమీద ఉన్న తమకేఉంటాయనీ ఆలోచించి భర్తకు తెలియకుండా బావగారికి అంటే తాతయ్యకు అన్నం లో విషం కలిపి పెట్టిందట! అదితిన్నతాతయ్య వెంటనే విషాహారమేదో తిన్నానని తెలుసుకొని వాంతిచేసుకుని, విషాన్నంతా కక్కేసి ప్రకృతి వైద్యం తెలిసిన వాడు కనుక కొన్ని తులసి ఆకులూ, ఇంకేవో ఆకులూ తిని బైటపడి వారం పాటు జ్వరం తో మంచాన పడ్డాడట.

ఆ తరువాత తమ్ముణ్ణి పిలిపించి తనపేరనున్న పదిహేనెకరాల పొలమూ తమ్ముడి పేర రాసి ఉరు వదిలేసి సన్యాసిలాగా దేశం అంతా రెండేళ్ళ పాటు తిరిగాడట. తరువాత గవర్నమెంటు స్వాతంత్ర సమరయోధులను గుర్తించి వారికి పొలాలు ఇవ్వడము జరిగాక , మా పెద్దమ్మమ్మ తమ్ముడు వాళ్ళ ఆస్తిపాస్తు లన్నీ నిరంకుశం గా లాక్కున్న సందర్భం లో ...పెద్దమ్మమ్మ గుంటూరూ తిరుగుతున్నప్పుడు దేచిరాజు వారింట్లో మళ్ళీ కలిసాడుట తాతయ్య. పిన మావగారి కొడుకే గనుక తాతయ్య కథంతా తెలుసుగనక జాలిపడి "మాయింట్లో నాలుగు రొజులు ఉందువుగాని రా నిత్యానందయ్యా " అని పిలిచిందట.

అప్పుడు అక్కయ్యలు చిన్నపిల్లలు గనుక వారి ఆటపాటల్లో తన దుఃఖాన్ని ఒంటరి తనాన్నీ మర్చిపోయి అలాగే కొన్నాళ్ళు ఉండిపోయాడట. ఆ తర్వాత అక్కయ్యల మీద వాత్సల్యంతో తనకు గవర్నమెంటువారిచ్చిన పొలాన్ని మీరే సాగుచేసుకోమని మాకుటుంబానికే ఇచ్చేసాడట. ఆపదలో ఉన్న మా కుటుంబాన్ని ఆదుకున్న దేవుడే మా తాతయ్య అని ఇంట్లో అనుకోవటం విన్నాను.

స్వంత తాతయ్యలు ఒకవేళ ఉన్నా అంతలా వాత్సల్యం చూపించేవారు కాదేమో. ఇప్పుడు ఆలోచిస్తే ఎంతో ఆశ్చర్యం అనిపిస్తుంది నాకు.భగవంతుడు ఎంతటి దయామయుడు! అసలు ఇటువంటి అద్భుతమైన ముగ్గురు వ్యక్తులు! వీళ్ళ జీవితం లో వీళ్ళకి తోడుగా ఎక్కడో స్వతంత్ర సంగ్రామ సభలో దొరికిన మూడేళ్ళ పిల్ల అమ్మ. అమ్మకి కలిగిన ఎనిమిది మందీ సంతానం! అందులోనూ ఏడుగురు ఆడపిల్లలు! ఈ మహాను భావులను ఆ భగవంతుడు ముందుగానే మాకోసం ముందే సృష్టించి ఉంచాడు కదా!

వేటపాలెం లైబ్రరీ చాలా ప్రఖ్యాతి గాంచిన లైబ్రరీ. అప్పట్లో అందులో లైబ్రేరియన్ నాకు గుర్తున్నంతవరకూ హనుమంతరావు గారు అనుకుంటా, ఆయనా ,మానిత్యానందం తాతయ్యా మాకు పుస్తకాలమీద కలిగించిన కుతూహలం అంతా ఇంతా కాదు. పాత కాయితం ముక్కదొరికినా ఏవుందో అని చదివేంత గా చదవటానికి అలవాటు పడిపోయాం. మారెండో అక్కయ్యని ఏడేళ్ళ వయసులోనే ఏడవతరగతి పరీక్షలు రాయించి జిల్లాకే ఫస్టు తెప్పించాడని అక్కయ్యలు చెప్పేవాళ్ళు.

ఏదేమైనా వేటపాలెం జీవితం నాకు ఆనందకరమైన స్మృతులను మిగిల్చినా ...అక్కయ్యల మాటల్లో విషాదం పాళ్ళే ఎక్కువ ఉండేవి. ప్రతి మూడేళ్ళకూ ఏవో తుఫానులు వచ్చేవట చేతికొచ్చిన పంట ఆ తుఫాను దెబ్బకి నీట మునిగేదట. దాని మీదనే ఆధార పడిన మా కుటుంబం గడవటం కొంచెం కష్టం గానే ఉండేదట. ఇంత మంది ఆడపిల్లలను కాపాడుకుంటూ అప్పో, సొప్పో చేసి మా అవసరాలు తీర్చిన వాళ్ళ ఋణం ఎలాతీరేనో కదా అనిపిస్తుంది నాకు.

ఆ ముగ్గురిలో ఎవరి తాలూకు సంతానమూ కాదు మేము. వాళ్ళది అమ్మతో అల్లుకున్న అనుబంధం అంతే. తమ తల్లి పుట్టింటి వైపు అన్నయ్య వరసయ్యే ఆయన కొడుకైన నాన్నను అల్లుడిగా చేసుకున్నా ...వాళ్ళకు భారం తీరకపోగా చిన్న వయసులోనే పెళ్ళి చేయటం వలన, పెళ్ళప్పటికి అమ్మకు పది సంవత్సరాలూ, నాన్నకు పదహారు సంవత్సరాలట! మొదట్లో నలుగురు పిల్లలను కని సినిమా వేషాలకోసం బొంబాయి లో మకాం పెట్టి సంసారాన్ని పట్టించుకోక అప్పుడప్పుడూ వచ్చిపోయే నాన్న, ఎనిమిది మందిమి కలిగాక కర్నాటకలో మంగుళూరులోకాంట్రాక్ట్ లు చేస్తూ స్థిరపడ్డారు.

అమ్మమ్మ చెప్పినట్లు నిజంగానే వాళ్ళు ఈదింది నారద సంసారమే ...కాకపోతే ఇంతమందికీ డిగ్రీ దాకా చదువు సంధ్యలూ, వివాహాలూ జరిపించటం అంటే మాటలుకాదు. అందుకోసం వాళ్ళెంత కష్టపడ్డారో, తిన్నారో తినలేదో, పస్తులే ఉన్నారో, అభిమానం చంపుకుని అప్పులో చేశారో ...ఇంత ప్రేమ ...అసలు ఎలా...మా కోసం ఆదేవుళ్ళే ఇలా మానవులుగా జన్మించారేమో అనిపిస్తుంది నాకు.

నిత్యానందం తాతయ్య కూడా రాయవెల్లూరు జైల్లో చాలా బాధలు అనుభవించాడని అమ్మమ్మ చెబుతుండేది. చాలా నాసిరకం బియ్యం తో సి క్లాసు ఖైదీలకు భోజనం పెట్టేవాళ్ళట. నల్లని ముక్కిపోయిన బియ్యం తో అన్నం వడ్డించేవాళ్ళట. ఎంతగా ముక్కిపోయినవంటే ...అన్నం కూడా చేదెక్కిపోయి ఉండేదట. అవి తిన్న తరువాత విపరీతమైన విరోచనాలు పట్టుకునేవట చాలామందికి.

విరోచనాలు పట్టుకున్న వాళ్ళందరూ తడవకూ మరుగుదొడ్లు వాడుతూ నీటిని ఎక్కువ వాడుతూ రాత్రిపూట పోలీసులను విగిస్తున్నారని పోలీసులు జైలర్ కి ఫిర్యాదు చేస్తే ...అసలే విరోచనాలు అవుతూ నీరసం గా ఉన్నవారికి పెట్టే ఆ కాస్త భోజనం కూడా రాత్రిపూట ఆపివేయమని ఉత్తర్వులు ఇచ్చాడుట ఆయన. అందరూ జబ్బుపడటానికి కారణం బియ్యమే గనుక వాటిని మార్చమని తాతయ్య వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ...ఆరోజు నుంచీ తాతయ్య దగ్గర పేపరూ పెన్నూకూడా ఉండరాదని అవికూడా లాక్కుని బాగా కొట్టారట.

అలాగే ఊరుకోకుండా తాతయ్య బీ క్లాసులో ఉన్న చిన్న చిన్న నాయకులకు ఈ విషయం చేరవేసి ఎలాగైనా బియ్యం మార్చాలనీ అందుకు సహకరించాలనీ కోరాడట. అక్కడ బీ క్లాసు ఖైదీల పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉండేదట. బియ్యం లో కాస్త పురుగులుండేవి గానీ, ఇలా విషం లా ఉండేవి కాదట. జైలు గదులూ పాయఖానాలూ కూడా కొంచెం పరిశుభ్రంగా ఉండేవట. వాళ్ళుకూడా జైలర్ తో సంప్రదిస్తే అతను ఒప్పుకోలేదట ఇది మీకు సంబంధించిన విషయం కాదు ఇందులో మీరు జోక్యం చేసుకోవద్దని హెచ్చరించాడట.

అయినా వాళ్ళు ఊరుకోకుండా తాతయ్యకు తమ మద్దతు తెలిపారట. తాతయ్య మర్రోజునుండీ నిరాహారదీక్ష కి కూర్చున్నాడట. రెండు రోజుల తర్వాత బిక్లాసునుండీ కొంతమంది తాతయ్యకు తోడుగా మేముకూడా నిరాహారదీక్ష చేస్తామంటూ చెప్పారట. ఇలా నాలుగైదు రోజులు గడిచాకసమస్యపెద్దదిగా మారుతోందని గ్రహించి జైలరు తాతయ్యకు నిరాహార దీక్ష మానుకోమనీ, కావాలంటే నిన్నుకూడా బీ క్లాసుకు మారుస్తానని ఆశపెట్టాడట.

తాతయ్య ఆయన మాటవినకుండా అందరికీ ఒకేరకమైన అన్నం పెట్టాల్సిందేనని పట్టు పట్టాడట. అది మాత్రం కుదరదనీ, ఇంకా నాలుగురోజులుంటే ప్రాణం పోతుంది అంతకంటే ఏమీ జరగదు మీ ఇష్టం అన్నాడట. అయినా తాతయ్య తన పట్టు వీడలేదట. ఆ తరువాత నాలుగు రోజులకి పై అధికారులు జైలు తనిఖీకి వస్తున్నారని తెలిసి జైలరు తాతయ్యను బ్రతిమలాడి, అందరికీ ఒకేలాంటి భోజనం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడట.

అయినా తాతయ్యా వాళ్ళు ఊరుకోకుండా పై అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు జరిగిన విషయమంతా చెప్పి, ఆ జైలర్ మీద ఫిర్యాదు దాఖలు చేసారట. అప్పుడు పై అధికారులు ఆజైలర్ ను బదిలీ చేసి ఇంకో జైలర్ ను వేసారని చెప్పేది అమ్మమ్మ .

దాదాపు తొంభై ఎనిమిది సంవత్సరాలు బ్రతికిన తాతయ్య, కంటి చూపు లేకపోయినా మేము చదువుకుంటుంటే అక్కడే చెక్క కుర్చీలో కూర్చొని మాచేతనే పాఠాలు చదివించి చక్కగా వివరించేవాడు. నిత్యమూ రామనామ జపం చేసుకునేవాడు.చక్కని పురాణ గాథలు చెప్పేవాడు.

ఆరోజు నాకు బాగా గుర్తు. ఉమక్క తెచ్చిచ్చిన జామ పండు మరీ మెత్తగా ఉందనీ, గట్టిగా ఉండే జామ పండు కావాలనీ అడిగాడు. పైగా "జామపండు కొరికితే కటుక్కున కొబ్బరి ముక్కలా శబ్దం రావాలని" నవ్వించాడు. అంత వయస్సువచ్చినా ఆయనపళ్ళు ఊడిపోలేదు సరికదా చాలా గట్టిగా ఉండేవి. కాసేపటికి అమ్మ వేడి వేడి పాలుపోసి పాలన్నం తెచ్చి ఇచ్చింది. రాత్రిపూట కేవలం పాలన్నమే తినేవాడు ఆయన.

అన్నం తిన్నాక వందడుగులు అన్నా నడవాలని ఆయన నియమం. మేము ఎవరో ఒకరం అసరాగా చెయ్యిపట్టి నడిపించేవాళ్ళం. పదడుగులు నడిచి ఏదోగా ఉందని గుండెపట్టుకుని కుర్చీలో కూర్చోపెట్టమన్నాడు. ఏమైందా అని కంగారుగా నాడిచూసిన పెద్దమ్మమ్మ వెంటనే నాడి అందటం లేదని క్రింద చాపవెయ్యమని ఉత్తరపు తలగా పడుకోబెట్టించి, గంగ తీర్థంలో తులసి ఆకు వేసి తీర్థం గొంతులో వేసి, "నిత్యానందయ్యా రామనామం చెప్పూ "అనగానే "శ్రీ రామ రామ రామ" అని రామ నామం చెపుతూ ప్రశాంతం గా కళ్ళు మూసాడు తాతయ్య.

ఇన్నేళ్ళ నా జీవితానుభవం లో ఇంత గొప్పదైన, ప్రశాంత మైన మరణం ఎప్పుడూ చూడలేదు. ఒక మహా యక్షుడో, దేవతో శాపవశాత్తూ ఈ భూమిమీద జన్మించి అవతారం చాలించాడు అనిపిస్తుంది ఇప్పుడు. అప్పుడు అందరం తాతయ్య శవం మీదపడి ఎంతగా రోదించామో,ఏ జన్మ సంబంధమో అది.

తాతయ్య చెబుతుండేవాడు "అమ్మలూ మీరందరూ పెద్ద పెద్ద చదువులు చదవాలర్రా అప్పుడు నేను ఉన్నా లేక పోయినా వీధి అరుగుమీద నిలబడి పైకి చూస్తూ తాతయ్యా నేను డిగ్రీ పాసయ్యానూ అని గట్టిగా అరవండి పైనున్న నాకు వినబడుతుంది. అప్పుడు నేను ఎంతో సంతోషిస్తా" అనేవాడు. ఇప్పుడు కూడా అరవాలని ఉంది తాతయ్యా నీగురించే రాసున్నా అని. కానీ గొంతు దుఃఖంతో పూడుకు పోతోంది. మాట పెగలటం లేదు.

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments